## ప్రజల ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలి

**- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**



కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 17 : జిల్లా ప్రజల ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఏర్పడి, ప్రభుత్వ దవాఖానల్లోగాని, ప్రైవేటు దవాఖానల్లోగాని వైద్య సేవలు పొందడంలో ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వాట్సాప్ నంబర్ 7780478817కు మెసేజ్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. ఈ నంబర్‌కు సమాచారం అందిన వెంటనే మీ సమస్య పరిష్కారం కోసం మా బృందం మీకు అందుబాటులో ఉండి సాయం చేస్తున్నదని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలియజేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం

**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి**



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 17 : సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంనూంతల గ్రామ పంచాయతీకి చెందిన పుల్యానాయక్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 57 వేల చెక్కును శనివారం బాధితుడికి గోలి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్ నాయక్, సుమన్ నాయక్, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాల కోసం అవగాహన

షాబాద్, ఆగస్టు 17: హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాల కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల సహాయ సంచాలకులు వీ ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత రంగ అభివృద్ధి కోసం ఇటీవల ప్రారంభించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో మూడేండ్ల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుకు సంబంధించి రాష్ట్ర విద్యార్థులకు 60 సీట్లు కేటాయించారని వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ దరఖాస్తులను tsht. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ కార్యాలయం, హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాన్నారు. అదేవిధంగా IIHT(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ)ప్రవేశం కోసం అవగాహన కల్పించేందుకు TSCO హైదరాబాద్ నుంచి స్పెషల్ ఆఫీసర్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ వస్తున్నట్లు చెప్పారు. వారు ప్రవేశాలపై వివరాలను వెల్లడిస్తారు కావున హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలోని చేనేత సంఘాల అధ్యక్షుడు మాస్టర్ వ్యూవర్స్ ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు కర్నాటి గార్డెన్స్, ఆటోనగర్ హైదరాబాద్‌లో జరిగే అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

## హామీలను నెరవేర్చాలి

**- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారాములు**



కల్లుగీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

మంచాల ఆగస్టు 17 : కల్లుగీత కార్మికుల హక్కుల సాధనకు పోరాడి అమరులైన వారిని మర్చిపోలేమని, కల్లుగీత కార్మికుల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేగానీ సీతారాములు డిమాండ్ చేశారు. అమరుల యాదిలో గీతన్నల చైతన్యయాత్రలో భాగంగా శనివారం మంచాల మండల కేంద్రంలో మంచాల మండల అధ్యక్షుడు సిద్దగోని మహేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి కల్లుగీత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సుధాకర్ గౌడ్, నాయకులు బాబయ్య, శ్రీనివాస్ గౌడ్, దోసపాటి సాయికుమార్, ముక్కం వెంకటేశ్‌గౌడ్, ముక్కమ్ నితిన్, మిద్దె నవీన్ గౌడ్, కారింగ్ సదానంద్ గౌడ్, ఓరిగంటి వరప్రసాద్, ఓరుగంటి భాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు నాగరాజు గౌడ్ వీరేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుణెలో చిక్కిన అంతర్రాష్ట్ర ముఠా

వికారాబాద్, ఆగస్టు 17 : అంతర్రాష్ట్ర శికారి గ్యాంగ్ దొంగలను వికారాబాద్ పోలీసులు పుణెలో అరెస్టు చేసినట్లు ఎస్పీ కే నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. జూన్ 30న పరిగి పోలీస్ స్టేషన్ పరిధి టీచర్స్ కాలనీలోని ఐదు ఇండ్లల్లో చోరీ జరిగిందని బాధితులు ఫిర్యాదు చేయగా పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారన్నారు. పరిగి పోలీస్ అధికారులు, క్లూస్ టీమ్, సీసీఎస్ పోలీస్ అధికారులు కలిసి చోరీ జరిగిన ఇండ్లల్లో ఆధారాలను సేకరించారన్నారు. ఈ చోరీలకు పాల్పడింది అంతర్రాష్ట్ర దొంగల ముఠా శికారి గ్యాంగ్‌లోని ముగ్గురు వ్యక్తులు అని గుర్తించినట్లు తెలిపారు.

### శికారి గ్యాంగ్ నేర విధానం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంతకల్ నుంచి శికారి గ్యాంగ్ వ్యక్తులు చోరీ చేయాలనే ఉద్దేశంతో రైల్వే మార్గం ద్వారా ప్రయాణం చేస్తూ కర్ణాటక రాష్ట్రం యద్గిర్‌లో రైల్వే స్టేషన్‌లో దిగి, బస్సులో ప్రయాణించి జూన్ 29న పరిగి పట్టణానికి చేరుకున్నారని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. రాత్రి 9 గంటలకు మద్యపానం సేవించి, తాళాలు వేసిన ఇండ్ల గుర్తించారని తెలిపారు. అర్ధ రాత్రి వెంట తెచ్చుకున్న చైన్ పాన, స్క్రూ డ్రైవర్ తదితర పనిముట్లతో ఇండ్ల తాళాలను విరగగొట్టారని తెలిపారు. వచ్చిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు బయట ఉండి ఎవరైనా వస్తున్నారా అని పరిశీలిస్తుండగా, ఒకరు ఇంటి దగ్గరలో ఉండి మరొకరిని ఇంటి లోపలికి పంపించారని పేర్కొన్నారు. జూన్ 30న పరిగిలోని టీచర్స్ కాలనీలోని ఐదు ఇండ్లల్లో చోరీ చేశారని తెలిపారు. మూడు ఇండ్లల్లో డబ్బులు గాని, నగలు కానీ ఏమీ దొరకకపోగా, ఒక ఇంటిలో 12 తులాల బంగారం, రూ.1.20 లక్షలు, మరో ఇంటిలో 3.3 తులాల బంగారం చోరీ చేశారని వివరించారు.

### దొంగలను పట్టుకొన్న విధానం..

చోరీ జరిగిన స్థలంలో పరిగి పోలీస్ అధికారులు, క్లూస్ టీమ్ అధికారులు సీసీఎస్ అధికారులు సేకరించిన ఆధారాలతో పాటుగా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి, టెక్నికల్ ఆధారాల సేకరణ అనంతరం గుంతకల్‌కు చెందిన అంతర్రాష్ట్ర శికారి గ్యాంగ్‌కు చెందిన ఏ1) పెద్ద సర్ధార్ (రాజు), ఏ2) శికారి మద్దిలేటి, ఏ3) చిన్న సర్ధార్ ( గబ్బర్ సింగ్)లను జూలై 29న అరెస్ట్ చేశామని చెప్పారు. తదపరి విచారణతో వీరే చోరీ చేసినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. ఇందులో సొంత తండ్రి కుమారులు చోరీకి పాల్పడిన అనంతరం పోలీస్ అధికారులకు దొరకవద్దన్న ఉద్దేశంతో ప్రతిసారి తమతో పాటుగా ఒక కొత్త వ్యక్తిని తీసుకువెళ్తారని చెప్పారు. గతంలో చిన్న సర్ధార్ లాగానే బూజులు, తేజ వంటి కొత్త వ్యక్తులను తీసుకెళ్లారని పేర్కొన్నారు. పరిగి పీఎస్ పరిధిలో చోరీలు చేసినందు వల్ల వారిని అరెస్ట్ చేసేందుకు గుంతకల్‌కు వెళ్లగా ఈ గ్యాంగ్ సభ్యులు పుణెకు పారిపోయారని తెలిపారు. టెక్నికల్ ఆధారాలు సేకరించి పుణెకు వెళ్లి అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వివరించారు. అరెస్ట్ చేసిన అనంతరం విచారించగా పరిగి పట్టణంలో జరిగిన చోరీలతో పాటు గతంలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటుగా పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. సీసీటీఎన్ఎస్, ఫింగర్ ప్రింట్ బ్యూరో నుంచి నేరస్తుల కేసుల వివరాలను తెలుసుకోగా పెద్ద సర్ధార్(రాజు), శికారి సర్ధార్‌లు 70కి పైగా చోరీల కేసుల్లో అరెస్టు అయ్యారని తెలిపారు. శికారి మద్దిలేటి మాధాన 42కు పైగా చోరీ కేసుల్లో అరెస్ట్ అయ్యాడని పేర్కొన్నారు. నిందితుల నుంచి 7 తులాల బంగారాన్ని రికవరీ చేశామని, మిగతా బంగారాన్ని కొనుగోలు శికారి గుంతకల్, కంసార్ రాంచందర్ చవాన్, శివాజీ నగర్, పుణెలపైనా కేసు నమోదు చేశామని ఎస్పీ చెప్పారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు తమ గ్రామాల్లో, కాలనీల్లో తిరుగుతున్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చన్నారు. కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాల్వంతయ్య, పరిగి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పరిగి ఎస్ఐ సంతోశ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జయవర్ధన్, చెన్నయ్య గౌడ్, గోవిందప్ప, కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, అంజప్ప, సత్తయ్య, రాజు, రాఘవేందర్‌రెడ్డి, రామ కృష్ణ, డబ్ల్యూపీసీ గాయత్రిలకు ఎస్పీ రివార్డులను అందజేసి అభినందించారు.




విలేకరులకు వివరాలను తెలియజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

# హాష్ ఆయిల్ రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

ఆదిబట్ల, ఆగస్టు 17 : ఆదిబట్ల పోలీసులు మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు కలిసి హాష్ ఆయిల్ రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.20 లక్షల విలువ చేసే 3.8 కేజీల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడారు. విశాఖ పట్నం జిల్లా మాడుగుళ్ల మండలం కింతలి వల్లాపురం గ్రామానికి చెందిన తాళ్లపురెడ్డి సుదీర్, తాళ్లపు రెడ్డి దేముళ్లు దగ్గరి బంధువులై వీరిద్దరు డ్రైవర్లుగా పని చేసేవారని తెలిపారు. విశాఖపట్నం జిల్లా, రవికమతం మండలం, చిన్నపచ్చిల గ్రామానికి చెందిన కేశంశెట్టి శంకర్‌రావు వ్యవసాయం చేసేవాడని పేర్కొన్నారు. ఈ ముగురు కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఈ అక్రమ మాదకద్రవ్యాల వ్యాపారంలోకి దిగారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్మాలనుకునేవారని తెలిపారు. వీరు మరో వ్యక్తి శ్రీనివాస్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారని పేర్కొన్నారు. గత కొంత కాలంగా ఈ ముగ్గురు హాష్ ఆయిల్‌ను చౌక ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో పేదలకు అమ్మి లాభం పొందేవారని చెప్పారు. వీరు అనకాపల్లిలోని అల్లంచెట్టుహిల్స్ నుంచి హాష్ ఆయిల్ కొనుగోలు చేశారన్నారు. అక్కడి నుంచి నగర శివారులోని ఓఆర్ఆర్ సమీపంలోని టీసీఎస్ వద్ద ఓ ఆటోను తీసుకుని ఆయిల్‌ను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి హాష్ ఆయిల్ 3.8 కేజీలు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోగా, ఆయిల్ విలువ దాదాపు రూ.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కొద్ది రోజులుగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో కుటుంబ సభ్యులే మాదక ద్రవ్యాల సరపరా ముఠాగా ఏర్పడి వ్యాపారం చేస్తున్నారని, వారిని గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారని సీఐ వివరించారు. కేజీ హాష్ ఆయిల్ తయారీకి సుమారు 35 నుంచి 40 కేజీల గంజాయిని ఉపయోగిస్తున్నారని అన్నారు. మొత్తం 3.8 కేజీల హాష్ ఆయిల్ సుమారు 150 కేజీల గంజాయితో సమానమని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలను సరపరా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

**20 లక్షల విలువ చేసే హాష్ ఆయిల్ స్వాధీనం**

**డ్రగ్స్ సరపరా చేసేవారి పై చర్యలు తప్పవు**

**ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి**

# భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

**కేంద్ర భూ వనరుల విభాగం సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రటరీ కునాల్**



కేంద్ర భూవనరుల విభాగం సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రటరీ కునాలకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్, రంగారెడ్డి కలెక్టర్ శశాంక తదితరులు

షాబాద్, ఆగస్టు 17 : రంగారెడ్డి జిల్లాలో చేపడుతున్న వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం కేంద్ర భూ వనరుల విభాగం సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రటరీ కునాల్, రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్, రంగారెడ్డి కలెక్టర్ శశాంకలతో కలిసి పరిశీలించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలనకై సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకున్న కేంద్ర భూ వనరుల విభాగం సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రటరీ కునాల్‌కు పుష్పగుచ్ఛాలు అందించి రాష్ట్ర భూ పరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్, రంగారెడ్డి కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలో రెవెన్యూ భూములకు సంబంధించి చేపడుతున్న రిజిస్ట్రేషన్ విధానాన్ని శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, వ్యవసాయేతర భూములకు సంబంధించి చేపడుతున్న రిజిస్ట్రేషన్ విధానాన్ని తహసీల్దార్ కార్యాలయంలో కేంద్ర భూ వనరుల విభాగం సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రటరీ కునాల్‌లకు రాష్ట్ర భూ పరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ వివరించారు. రిజిస్ట్రేషన్ చేపడుతున్న సమయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు ఏ విధంగా పరిష్కరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ రమాదేవి, తహసీల్దార్ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

## మంత్రుల దృష్టికి పోడు భూముల సమస్య

**మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

బషీరాబాద్, ఆగస్టు 17 : మండలంలోని పోడు భూముల సమస్యలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలో మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో తెలంగాణ – కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న సరిహద్దు అటవీ భూమి సమస్యను ఎమ్మెల్యే మంత్రులకు వివరించారు. మంత్రులు వెంటనే స్పందించి హామీ ఇచ్చారని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# భారత్‌ను కదిలిస్తున్న బంగ్లా మారణ హోమం

**బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్, బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేశ్**

షాబాద్, ఆగస్టు 17: పొరుగున ఉన్న బంగ్లాదేశ్ దుస్థితి చూస్తుంటే భారత్ భవిష్యత్తు కనిపిస్తున్నదని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్, బజరంగ్‌దళ్ కన్వీనర్ గూడెం రమేశ్ అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్‌లో పెరుగుతున్న ముస్లిం జనాభా బంగ్లాదేశ్ సంకేతాలను మన ముందు ఉంచుతున్నదన్నారు. ఇక్కడి రాజకీయ అవసరాల నిమిత్తం ఓటు బ్యాంకు రాజకీయాలను కాపాడుకునే క్రమంలో నేతలంతా మైనార్టీలైన ముస్లింలకు మద్దతు ఇవ్వడంలో చాలా బిజీగా ఉన్నారన్నారు. కులాలు ప్రాంతాలకు అతీతంగా హిందువు అన్న వారిని గుర్తించి పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు, అనే భేదం లేకుండా అస్తవ్యస్తమైన ఈ పరిస్థితుల్లో అతివాద జిహాది శక్తులు అక్కడి మైనార్టీ వర్గం హిందూ సమాజంపై పెద్ద ఎత్తున విరుచుకుపడుతున్నారన్నారు. అడ్డుఅదుపు లేని జియాదిశక్తులు హిందువులపై కత్తులు మారనాయుధాలతో స్వైర విహారం చేస్తున్నారన్నారు. కరోనా కష్ట సమయంలో మొదలుకొని నిత్యం ఆహారాన్ని అందజేస్తున్న ఇస్కాన్ దేవాలయాలను సైతం ధ్వంసం చేయడమే లక్ష్యంగా కనిపిస్తున్నదన్నారు. కనిపించిన దేవాలయాల్లో విగ్రహాలతో పాటు ఆస్తులను దోచుకెళ్లడం, హిందూ ఇండ్లల్లోకి చొరబడి లూటీలు చేస్తున్నారని మండిపడ్డారు. కనిపించిన హిందూ స్త్రీలపై లైంగిక దాడులకు తెగబడుతున్నారని, ఈ దృశ్యాలను చూస్తుంటే మనసు తీవ్రంగా కలిచివేస్తున్నదన్నారు. భారతదేశానికి బంగ్లాదేశ్ బంధాలను తెంచివేస్తూ ఇందిరాగాంధీ సాంస్కృతిక కేంద్రాన్ని కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, బంగ్లాదేశ్‌లో భారతీయ సంస్కృతిగా కేంద్రం మందిరాలు హిందువులపై దాడులు అవమానకరం, ఆందోళనకరమన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపోలు నర్సింహులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు రమేశ్‌యాదవ్, చందిప్ప జంగయ్య, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, సత్యానారాయణ, రమేశ్‌యాదవ్, సురేశ్, నాయకులు దండు రాహుల్, చంద్రపాల్, మంగళి రవి, ఓం ప్రకాశ్, జనార్ధన్, కిరణ్, శ్రీధర్ రెడ్డి, నారాయణ, మానెయ్య, హరీశ్, మహేశ్, రఘు, ఉపేందర్ రెడ్డి, శ్రీను, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



షాబాద్ లో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు